క్లుప్తంగా

'విద్యావిధానంలో అనేక మార్పులు'



మాట్లాడుతున్న కోటేశ్వర్‌రావు, రజితరావు

జగిత్యాల: మారుతున్న కాలానికనుగుణంగా విద్యావిధానంలో అనేక మార్పులు వస్తున్నాయని నీట్ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ కోటేశ్వర్‌రావు, మానస స్కూల్ డైరెక్టర్ రజిత రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మానస స్కూల్‌లో ఐఐటీ, నీట్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఐఐటీ, నీట్ ఫౌండేషన్ ఎంతో విలువైందని, ముందు నుంచే ప్రిపరేషన్ కావాలన్నారు. మానస స్కూల్‌లో సైతం ప్రారంభిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. హరిచరణ్‌రావు, మౌనికరావు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు

కోరుట్ల: తనను మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొంటూ అదే కళాశాలలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మి బుధవారం ఇంటర్ విద్య నోడల్ అధికారి నారాయణకు ఫిర్యాదు చేశారు. బ్లాక్ మెయిల్ చేసి వైట్ పేపర్‌పై సంతకం చేయించుకున్నారని, తోటి ఉద్యోగుల ముందు ఇష్టారీతిన మాట్లాడి బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యాసంవత్సరానికి గాను 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్ జగిత్యాల జిల్లా సమన్వయాధికారి పి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ప్రైవేట్ కన్నా దీటుగా విద్య ఉంటుందని, ఉత్తమ విద్యతోపాటు చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21న ఉంటుందని అన్నారు.

పేదింటి అమ్మాయి వివాహానికి చేయూత



మానసకు పెళ్లి సామగ్రి అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

మల్లాపూర్: పేదింటి అమ్మాయి వివాహానికి మెట్‌పల్లి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బుధవారం సాయమందించారు. గుండంపల్లికి చెందిన సింగజోగి మానసకి ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వివాహానికి కావాల్సిన సామగ్రిని అందజేశారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ట్రస్ట్ నేతృత్వంలో ఇప్పటివరకు 56మంది అమ్మాయిల వివాహానికి సహకారమందించామన్నారు. మానసకు పుస్తెమెట్టెలు, స్టీల్ సామగ్రి, పట్టుచీర, 25కిలోల బియ్యం, వంట సరుకులు అందజేసినట్లు తెలిపారు. గుయ్య శ్రీశైల మల్లేషయాదవ్, మార్గం నరేష్, డప్పుల నర్సయ్య, నారాయణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కోరుట్ల: పట్టణంలోని పద్మశాలీ సంఘం భవనంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. ప్రజలకు గుండె పరీక్షలను ఉచితంగా చేశారు. గుండె సమస్యలున్నవారికి ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా వైద్యం అందిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు శ్రావణ్, ఆసుపత్రి ఇన్‌చార్జి గుర్రం కిరణ్, చంద్రశేఖర్, సాయితేజ, సంఘం నాయకులు రుద్ర శ్రీనివాస్, నాగభూషణం, నవీన్, ప్రసాద్, మధు, రాజగంగాధర్, రాజశేఖర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

జగిత్యాల: ధరూర్ క్యాంప్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కొత్త ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నల్ల లక్ష్మణ్, గాలిపల్లి విఠల్, కోశాధికారిగా కమటాల సునీల్, సభ్యులుగా లక్ష్మీనారాయణగౌడ్, రాజేశ్, సాగర్, గంగాధర్, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్ ఎన్నికయ్యారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు



కిష్టంపేటలో చెట్ల పొదల్లో తుప్పపడుతున్న పరికరాలు



ఉప్పుమడుగులో చదును చేయని క్రీడా ప్రాంగణంలో గేదెలు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోవాలని కోరుతున్న క్రీడాకారులు

రాయికల్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రాయికల్ మండలంలో 32 గ్రామాలుండగా.. 29 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. అయోధ్య, రాజనగర్, వీరాపూర్ గ్రామాల్లో సరైన స్థలం లేక ఏర్పాటు చేయలేదు. 29 గ్రామాల్లో ఒక్కో క్రీడా ప్రాంగణం కోసం రూ.1.50లక్షల్లోపు నిధులు మంజూరు చేశారు. వాలీబాల్, ఖోఖో, జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. ఈ క్రీడా ప్రాంగణాలు చాలా గ్రామాల్లో గుట్టలు, ఎత్తుపల్లాల్లో ఏర్పాటు చేసి నామమాత్రంగా బోర్డులు పెట్టి వదిలేశారు. కొన్ని గ్రామాల్లో తూతూమంత్రంగా ఏర్పాటు చేసి బిల్లులు తీసుకున్నారు. క్రీడా ప్రాంగణాలకు కేటాయించాల్సిన వాలీబాల్, క్రికెట్, వ్యాయామ పరికరాలు గ్రామ పంచాయతీలో ఉంచారు. ప్రస్తుతం క్రీడా ప్రాంగణాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాలు వినియోగించేలా చర్యలు చేపట్టాలని క్రీడాకారులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన పరికరాలు తుప్పుపట్టిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం వాటిని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టి మరిన్ని క్రీడా పరికరాలు మంజూరు చేయాలి.

– సాయితేజ, క్రీడాకారుడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



రాయికల్ మండలంలో క్రీడా ప్రాంగణాలు వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. క్రీడా ప్రాంగణాలు లేని గ్రామాల్లో ఏర్పాటుకు కృషి చేస్తాం. గ్రామ పంచాయతీల్లో ఉన్న కిట్లను సద్వినియోగం చేసుకోవాలి.

– చిరంజీవి, ఎంపీడీవో

చిత్ర కథ



మట్టికుప్పలు మాయం

మల్యాల: వరద కాలువ తవ్వకాల్లో గుట్టలుగా పోసిన మట్టి కుప్పలు కరిగిపోతున్నాయి. టిప్పర్లలో రేయింబవళ్లు మట్టి తరలిస్తుండడంతోపాటు వాహనాల వేగంతో ద్విచక్ర వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. దీనికితోడు టిప్పర్లలో మట్టి ఎత్తుగా పోయడంతో.. టిప్పర్ల నుంచి రోడ్ల వెంట మట్టి పెళ్లలు, చిన్నచిన్న బండరాళ్లు పడుతున్నాయి.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు



పెగడపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీవో మహేందర్

పెగడపల్లి: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీవో మహేందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఏఎస్సై సత్తయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, కారోబార్ స్వామి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ఆదమరిస్తే అంతే..

మేడిపల్లి: గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు కమ్మరిపేట–వెంకట్రావుపేట మధ్య వంతెన ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. అప్పట్లో అరకొర మరమ్మతులు చేసి వదిలేశారు. అప్పటినుంచి ఆ బ్రిడ్జిని పట్టించుకునే నాథులే లేరు. కేవలం చిన్నపాటి వాహనాలు వెళ్తున్నాయి. భారీ వాహనాలు వస్తే కావారం బైపాస్ రోడ్డు నుంచి పోవాల్సి వస్తోంది. భీమారం మండలానికి వచ్చే ప్రధాన రహదారిని పట్టించుకునేవారే లేరని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా మరమ్మతు చేయించాలని, లేదా నూతన బ్రిడ్జిని నిర్మించాలని కోరుతున్నారు.

రహదారులపై పశువులు..



రోడ్డుపై పశువుల గుంపు



డివైడర్ మధ్యలో సేద తీరుతున్న పశువులు

బుగ్గారం: ధర్మపురి పట్టణంలో కొంతకాలంగా పశువుల సంచారం తీవ్రమైంది. వందల సంఖ్యలో పశువులు రోడ్లపైనే సంచరిస్తూ రాత్రివేళల్లో రహదారులపైనే తిష్ట వేస్తూ వ్యాపారులు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ముఖ్యంగా శనివారం వారసంత జరిగే రోజు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలు ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయి. పట్టణ సుందరీకరణలో భాగంగా నాటిన మొక్కలను తింటూ వాటిని పూర్తిగా ధ్వంసం చేస్తున్నాయి. పలు వాహన ప్రమాదాల్లో పశువులకు సైతం తీవ్ర గాయాలై చనిపోతున్నాయి. వీటి గురించి స్థానికులు ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

జగిత్యాల డిపోకు అదనంగా బస్సులు కేటాయించండి



డీఎం సునీతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలటౌన్/జగిత్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పెరిగిన ప్రయాణికుల సంఖ్యకనుగుణంగా జగిత్యాల డిపోకు కొత్త బస్సులు మంజూరు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు. బుధవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు లేఖ రాశారు. డిపో పరిధిలో పెరిగిన ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జగిత్యాల డిపోకు 30 కొత్త బస్సులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం జగిత్యాల డిపో మేనేజర్ సునీతను డిపో ఆవరణలో కలిశారు. నిలిపివేసిన గంగాపూర్, గుట్రాజ్‌పల్లి, అనంతారం బస్సులను తిరిగి ప్రారంభించాలని కోరారు. వెల్గటూర్ నుంచి జగిత్యాల వయా గంగాపూర్, గుట్రాజ్‌పల్లి, అనంతారం పాత బస్ రూట్‌ను పునరుద్ధరించాలన్నారు. గుట్రాజ్‌పల్లి, గంగాపూర్ మాజీ సర్పంచులు బాల ముకుందం, జగన్ ఉన్నారు.

సారంగాపూర్: పంటలు ఎండకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం సారంగాపూర్ గ్రామంలో గ్రామ దేవతల ప్రతిష్ఠ, పోతారంలో శ్రీమల్లికార్జునస్వామి ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. యాసంగి పంటలు సాగునీరందక ఎండిపోతున్నాయని, దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రాజేందర్‌రెడ్డి, సుధాకర్‌రావు, గంగారెడ్డి, రామారావు తదితరులున్నారు.

అయితిపల్లిలో పశు వైద్యశిబిరం



పెగడపల్లి: పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

పెగడపల్లి: అయితిపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. 220 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. సిబ్బంది సంతోష్, వినీత్, గోపాల మిత్ర జానీపాష పాల్గొన్నారు.

కోరుట్ల: జోగిన్‌పెల్లి గ్రామంలో పశువుల టీకా శిబిరాన్ని బుధవారం మానిటరింగ్ అధికారి బక్కయ్య తనిఖీ చేశారు. గ్రామంలోని అన్ని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. 329 గేదెలు, 16 ఆవులకు టీకాలు వేసినట్లు అధికారులు పేర్కొన్నారు. పూర్ణచందర్, దేవేందర్, నయిద్, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

గుండు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఆహ్వానం



చైర్మన్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

జగిత్యాలటౌన్: గుండు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు హాజరు కావాలని బల్దియా చైర్మన్ అడువాల జ్యోతికి కమిటీ సభ్యులు బుధవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. జగిత్యాల పట్టణంలోని మంచి నీళ్ల బావి వద్ద చింతకుంట చెరువు మడేలేశ్వర స్వామి ఆలయం పక్కన ఇటీవల నిర్మించిన శ్రీగుండు అభయాంజనేయస్వామి స్థిర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరు కావాలని కోరారు.

ఆధ్యాత్మికం

ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మేడిపల్లి: వల్లంపల్లి గ్రామంలో శ్రీఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గౌడ కులస్తులు సల్లంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, మార్గం నర్సారెడ్డి, చేపూరి నాగరాజు, సాయిని గంగారెడ్డి, ఉరుమట్ల లక్ష్మణ్, శ్రీపతి దామోదర్, గడ్డం జలందర్‌రెడ్డి, గంగధర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలి

వెల్గటూర్: ధర్మపురి నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎల్లమ్మ తల్లిని వేడుకున్నట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఎండపల్లి మండలం కొత్తపేటలో బుధవారం నిర్వహించిన ఎల్లమ్మ పట్నాల కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు పూరది రమేశ్, కొత్తపేట గ్రామ గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో భోగ శ్రావణి పూజలు



సారంగాపూర్: మండల కేంద్రంలో జరుగుతున్న గ్రామ దేవతల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవార్ల ప్రసాదాలను అందజేశారు. పోతారం గ్రామంలో శ్రీమల్లికార్జునస్వామి ప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకులు బద్దెల గంగరాజం, చెరుకు గంగారెడ్డి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయాలి

మేడిపల్లి: మోత్కురావుపేట–చందుర్తి గ్రామాలు, జిల్లాల సరిహద్దు ప్రాంతాలు కావడం, ఇటీవలే ఈ ఫారెస్ట్ రోడ్డుకు మరమ్మతు చేయడంతో.. ఈ రోడ్డు గుండా వాహన ప్రయాణాలు ఎక్కువయ్యాయి. వేములవాడ, సిరిసిల్ల, హైదరాబాద్ వైపునకు, అక్కడినుంచి రాయికల్, జగిత్యాల, ఆదిలాబాద్ వైపునకు అధికంగా రవాణా పెరిగింది. ఈ రోడ్డు ద్వారా వెళ్తే సుమారు 25 కిలోమీటర్ల ప్రయాణ దూరంతోపాటు సమయం, డబ్బు రెండు ఆదా అవుతాయని ప్రయాణికులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చినా.. అధికారులు ఈ జిల్లా సరిహద్దులో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయలేదు. రాజన్న సిరిసిల్ల–జగిత్యాల జిల్లాల సరిహద్దు గ్రామాలుగా మోత్కురావుపేట–చందుర్తి గ్రామాలున్నాయి.

ఆర్థిక లావాదేవీలపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న రైతులు

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం పూడూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వరి ధాన్యం కొనుగోలు నిర్వహణ, రుణాల వసూళ్లు, ఆర్థిక లావాదేవీలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బండ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు, పాలకవర్గం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత మైతాపూర్



బహుమతి అందుకుంటున్న జట్టు సభ్యులు

రాయికల్: కుమ్మరిపల్లిలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలు బుధవారం ముగిశాయి. విజేతగా మైతాపూర్, రన్నర్‌గా మేడిపల్లి జట్లు నిలిచాయి. కల్వకోట కార్తీక్, పెనుగొండ గణేశ్, నిర్వాహకులు శివమణి, రాంసురేశ్, గంగన్న, శ్రీనివాస్, బుల్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గాలి వీస్తోంది

సారంగాపూర్: ప్రస్తుతం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోందని జీవన్‌రెడ్డి అన్నారు. సారంగాపూర్, పోతారంలో గ్రామదేవతల ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొన్నారు. ఫోన్‌ట్యాపింగ్‌పై కేసీఆర్‌ను కూడా విచారణ చేపట్టాలన్నారు. నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా పార్టీ తనకు అవకాశం ఇచ్చిందని, కార్యకర్తలు, నాయకులు గెలిపించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎంపీపీ మసర్తి రమేశ్, నాయకులు తోడేటి శేఖర్‌గౌడ్, కోండ్ర రాంచంద్రారెడ్డి, కొక్కు గంగారాం తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కోరుట్ల: పట్టణంలోని మహాదేవస్వామి ఆలయ చైర్మన్, సింగిల్ విండో డైరెక్టర్ పిట్టల నరేశ్, రాజేశ్ కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. తిరుమల గంగాధర్, రాజు, ఎంపీ నయీం, మచ్చ కవిత, సత్యంరావు, మధు, ప్రవీణ్, నర్సయ్య పాల్గొన్నారు.